నమస్తే తెలంగాణ
# జనగామ
5 | మంగళవారం 28 మే 2024 | JANAGAON

● పట్టమెవరికో?


నర్మెట పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో పట్టభద్రులు

# ఓటోత్సాహం..

## ప్రశాంతంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- ఉమ్మడి జిల్లాలో 72.66 శాతం పోలింగ్ నమోదు
- ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు
- ఉత్సాహం చూపిన దివ్యాంగులు, కొత్త ఓటర్లు
- పర్యవేక్షించిన కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు
- బందోబస్తు నడుమ నల్లగొండకు బ్యాలెట్ బాక్సులు



ఆర్ట్స్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న రాకేశ్‌రెడ్డి దంపతులు, ప్రేమేందర్‌రెడ్డి



ఓటు వేసినట్లు చూపుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు దంపతులు, ఓటు వేస్తున్న బండా ప్రకాశ్



ఓటు వేసిన ఎమ్మెల్యే నాగరాజు, ఓటు వేసేందుకు క్యూలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి



పట్టభద్రులు చైతన్యంతో ఓటెత్తారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం ఉప ఎన్నిక జరుగగా ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తొలుత మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం తర్వాత పుంజుకోగా యువతతో పాటు సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఉత్సాహంగా ఓటేసేందుకు బారులు తీరారు. అలాగే దివ్యాంగులు సైతం బాధ్యతగా తమ హక్కును వినియోగించుకోవడం కనిపించింది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగియగా ఉమ్మడి జిల్లాలో 72.66 శాతం నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నగరంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, జిల్లాల్లో ఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించగా, కలెక్టర్లు పోలింగ్ నిర్వహణను పరిశీలించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బందోబస్తు మధ్య ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను తరలించారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా గ్రాడ్యుయేట్లు పట్టమెవరికి కట్టారనేది వచ్చే నెల 5న తేలనున్నది.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 27


పర్వతగిరిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మహబూబాబాద్‌లో చిన్నారిని లాలిస్తున్న కానిస్టేబుల్


ఓటేసినట్లు చూపుతున్న ఎమ్మెల్యే మురళి, కండక్టర్

**జిల్లాల వారీగా నమోదైన పోలింగ్ శాతం**

| | |
|---|---|
| హనుమకొండ | 71.21 |
| వరంగల్ | 70.83 |
| ములుగు | 74.54 |
| జనగామ | 76.28 |
| మహబూబాబాద్ | 69.52 |
| జయశంకర్ భూపాలపల్లి | 73.62 |
| మొత్తం | 72.66 |



## రాకేశ్‌రెడ్డి విజయం ఖాయం

- కాంగ్రెస్ పాలనపై నిరుద్యోగులు, పట్టభద్రుల్లో అసంతృప్తి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, మే 27 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సోమవారం జనగామ జిల్లాకేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ బూత్‌లో పల్లా, గిర్నిగడ్డ ఏబీవీ హైస్కూల్‌లో ఆయన సతీమణి నీలిమ ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరుద్యోగులు, పట్టభద్రులు విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. నిరుద్యోగ భృతి, 2లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లు, మెగా డీఎస్సీపై హామీలిచ్చి నెరవేర్చలేదన్నారు. క్లీన్ ఇమేజ్ ఉన్న రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులంతా కలిసి భారీ మెజార్టీతో గెలిపించబోతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటివరకు నాలుగుసార్లు ఘన విజయం సాధించగా పట్టభద్రులు, నిరుద్యోగులు, మేధావుల మద్దతుతో ఐదోసారి గెలువడం ఖాయమైందని పేర్కొన్నారు.


జనగామలో ఓటేసినట్లు చూపుతున్న ఎమ్మెల్యే పల్లా



భూపాలపల్లిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేశ్, ములుగులో ఓటేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి





జనగామలో చంటి పాపతో ఓటేసిన పట్టభద్రురాలు, వరంగల్‌లో ఓటు వేసిన దివ్యాంగురాలైన తన అక్కను తీసుకెళ్తున్న సోదరుడు, ఓటేసినట్లు చూపుతున్న దివ్యాంగుడు


వరంగల్ కలెక్టరేట్ డీఆర్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


గార్లలో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ, ఆమె నలుగురు చెల్లెళ్లు


ఇస్లామియా కళాశాలలో సీపీ అంబర్ కిషోర్ పర్యవేక్షణ

ఓటేసిన హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఓటేయడానికి వస్తున్న వృద్ధులు


పోలింగ్ కేంద్రం వద్ద సెల్‌ఫోన్ పాయింట్

## మల్లన్న చిల్లర మాటలెవరూ నమ్మరు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి**

ఖానాపురం, మే 27 : తీన్మార్ మల్లన్న చిల్లర మాటలు ఎవరూ నమ్మరని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అమెరికాలో ఉన్నత ఉద్యోగం మానేసి ఇండియాకు వచ్చింది జై తెలంగాణ నినాదం కోసమేనని అన్నారు. ఆనాడు తనను కాకతీయ యూనివర్సిటీ ముందుండి నడిపించిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నాయకులతో రాజకీయ పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. తీన్మార్ మల్లన్న చిల్లర మాటలను ఎవరూ నమ్మరన్నారు. ఎన్నికల్లో ఒక స్థిరమైన వ్యక్తిత్వం గెలుస్తుందే తప్ప బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు తావులేదన్నారు. ఇప్పటికైనా తీన్మార్ మల్లన్న తన మాటలు మార్చుకోకపోతే భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు.


ఖానాపురంలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

## పది మందిని ఎలా అనుమతిస్తారు..?

- పోలింగ్ బూత్‌లోకి అనుచరులతో వెళ్లిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న
- ఓటర్ల ఆగ్రహం, పోలీసులతో వాగ్వాదం


ప్రశాంత్‌నగర్‌లోని పోలింగ్ బూత్ వద్ద పోలీసులను నిలదీస్తున్న ఓటర్లు, స్థానికులు

కాజీపేట, మే 27: కాజీపేటలోని 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పది మంది అనుచరులతో రావడంపై ఓటర్లు ఆగ్రహించారు. ఎలా అనుమతిస్తారని అక్కడున్న పట్టభద్రులు విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిబంధనల మేరకే వెళ్లారని పోలీసులు చెప్పడంతో 'సీసీ కెమెరాలు పరిశీలిద్దాం పద.. ఆయనకున్న అదనపు అర్హతలు ఏమిటి?' అంటూ రాజకీయ నాయకులు, స్థానికులు, ఓటర్లు నిలదీయడంతో పోలీసులు నీళ్లు నమిలారు. ఆ తర్వాత అనుచరులను బయటకు పంపి, అభ్యర్థిని మాత్రమే లోపలికి అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది.

## మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- పావులు కదుపుతున్న పలువురు కార్పొరేటర్లు
- అదనపు కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్లు
- అసంతృప్తుల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు
- ఎన్నికల కోడ్ ముగిశాక నోటీసు ఇచ్చే యోచన





వరంగల్, మే 27 : నగర మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కొందరు కార్పొరేటర్లు రంగం సిద్ధం చేస్తున్నారు. మేయర్ పదవిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమెను పదవి నుంచి తప్పించాలని కొందరు కార్పొరేటర్లు పావులు కదుపుతున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తాను కొందరు కార్పొరేటర్లు ఇటీవల కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చేందుకు విధి విధానాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. అదనపు కలెక్టర్ సైతం గ్రేటర్ అధికారులతో చర్చించినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మాన నోటీస్ ఫార్మాట్ పంపాలని గ్రేటర్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పాలకవర్గంలో 50శాతానికిపైగా కార్పొరేటర్లు సంతకాలు పెడితేనే అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇచ్చే అవకాశం ఉంటుందని కార్పొరేటర్లకు చెప్పినట్లు సమాచారం. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మూడేళ్ల కాలపరిమితి నిబంధన ఉంది. మే 7వ తేదీతో మూడేళ్లు పూర్తి కాగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు ఇప్పటికే పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

**ఎన్నికల కోడ్ తర్వాత నోటీస్**

పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అవిశ్వాస తీర్మాన నోటీస్ ఇచ్చేందుకు కొందరు కార్పొరేటర్లు పావులు కదుపుతున్నారు. అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉండి అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేస్తే పరిస్థితులు ఎలా ఉంటాయనే దానిపై కొందరు కార్పొరేటర్లు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. పాలకవర్గంలోని సగం మంది కార్పొరేటర్ల కంటే ఎక్కువ మంది అంటే 34 మంది అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సంతకాలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వాలంటే సొంతంగా బీఆర్ఎస్‌కు సంఖ్యా బలం లేదు. బీజేపీ కార్పొరేటర్లతోపాటు అధికార పార్టీలోని కొందరు కార్పొరేటర్లు కలిస్తేనే అది సాధ్యమవుతుంది. ఏది ఏమైనా అవిశ్వాస తీర్మానం పెట్టాలని కొందరు కార్పొరేటర్లు బలంగా పనిచేస్తున్నారు.